بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِهِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Eid ul Fitr Sermon Hazrat Khalifatul Masih V 31.03.2025 (Telugu)

# కేవలం పాపాల నుండి దూరముండుటయే తఖ్వా (దైవభీతి) అనబడదు
# సత్కార్యాలను పాటిస్తూ వాటిని కొనసాగిచడమే నిజమైన దైవభీతి అనబడుతుంది

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 31.03. 2025 తేదీన – మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన ఖుత్బా ఈదుల్ ఫితర్ జుమా సారాంశము**

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

తషహ్హుద్, తవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనాంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

రమజాన్ నిన్నటితో ముగిసింది మరియు నేడు మనం అల్లాహ్ అనుగ్రహంతో ఈదుల్ ఫిత్ర్ (పండుగ) జరుపుకుంటున్నాము. రమజాన్‌లో మనం చేసిన పుణ్యకార్యాలు మరియు ఏ సత్కార్యాలను (మంచి పనులను) కొనసాగించాలని మనం ప్రతిజ్ఞ చేశామో, పునరుద్ఘాటించామో వాటి సంతోషాన్ని జరుపుకోవడమే నేటి ఉద్దేశ్యం. కావున ఈ పండుగ కేవలం ఆనందాన్ని జరుపుకునే రోజు మాత్రమే కాదు, ఆ పుణ్యకార్యాలన్నింటినీ ఇకముందు కూడా కొనసాగిస్తామని నిశ్చయించుకోవాల్సిన రోజు. ఇది జరిగినప్పుడే మన పండుగ నిజమైన పండుగ అవుతుంది.

కేవలం పాపాలకు దూరంగా ఉండటమే తఖ్వా (దైవభీతి) కాదు, నిజమైన దైవభీతి అంటే పుణ్యకార్యాల మీద స్థిరంగా నిలబడటం మరియు వాటిని నిరంతరం కొనసాగించడం. అల్లాహ్ తఆలా పట్ల మన బాధ్యతలను మరియు తోటి మనుషుల పట్ల మన బాధ్యతలను ఎల్లప్పుడూ దృఢంగా నెరవేరుస్తామని నేడు మనం మన ప్రతిజ్ఞను పునరుద్ధరించుకుంటున్నాము.

పండుగ అనగా కేవలం తినడం, త్రాగడం, ఆడుకోవడం లేదా క్రొత్త బట్టలు ధరించడం మాత్రమే కాదు. భవిష్యత్తులో కూడా మనం మంచి పనులను కొనసాగించాలని మరియు పాపాల నుండి దూరంగా ఉండాలని పండుగ మనకు సందేశాన్ని ఇస్తుంది. పండుగ వేడుకల తర్వాత, ఒకవేళ మనం తిరిగి రమజాన్ కంటే ముందున్న పాత అలవాట్లకే వెళ్ళిపోతే, లేదా మన జీవితాల్లో ఆధ్యాత్మిక పురోగతి లేకపోతే, అది ఒక విశ్వాసి లక్షణం అనిపించుకోదు. నానాటికీ పుణ్యకార్యాలలో నిరంతరం ముందుకు సాగడమే నిజమైన విశ్వాసి గొప్పతనం.

నేడు మనం ఆత్మపరిశీలన చేసుకోవలెను. ఈ ప్రతిజ్ఞకు కట్టుబడి ఉండటానికి మనం సిద్ధంగా ఉన్నామా? అల్లాహ్ తఆలాతో మనం చేసుకున్న వాగ్దానాన్ని నెరవేర్చడానికి నిజంగా ప్రయత్నిస్తున్నామా? సూత్రప్రాయంగా అయితే రమజాన్ పండుగ (ఈదుల్ ఫిత్ర్) మనకు ఈ

నిదర్శనాన్ని చూపవలెను. ఒక నెల రోజుల ఉపవాసాల ద్వారా మనం అల్లాహ్ తఆలా సామీప్యానికి చేరుకున్నామని, ఒకవేళ మనకు దైవం లభించినట్లయితే, మన పుణ్యకార్యాలలో స్పష్టమైన పురోగతి కనిపించవలెను.

పండుగ కేవలం సంతోషాలను జరుపుకునే రోజు మాత్రమే కాదు, ఇది ఆరాధనల వైపు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన రోజు. మిగతా రోజులతో పోలిస్తే, ఈ రోజున మనపై ఎక్కువ నమాజులు విధిగా నిర్ణయించబడ్డాయి. సాధారణ రోజుల్లో మనపై ఐదు పూటల నమాజులు విధిగా ఉంటే, పండుగ రోజున మనపై ఆరు నమాజులు విధిగా (ఫర్జ్) మారతాయి. కావున ఇది దైవప్రార్థనల కోసం కేటాయించబడిన ఒక ప్రత్యేకమైన రోజు అని మనం తప్పక గుర్తుంచుకోవలెను.

ఒకవేళ మనకు దైవం లభించని యెడల, అతని ఆరాధనల హక్కును మనం నెరవేర్చని స్థితిలో, తోటి మనుషుల హక్కులను తీర్చలేకపోయినప్పుడు కేవలం సంబరాలు చేసుకోవడం పండుగ అసలు ఉద్దేశ్యం కాదు. తోటి మనుషుల హక్కులను నెరవేర్చడం కూడా ఒక రకమైన ఆరాధనే. దైవం లభించని వ్యక్తిని హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) గారు ఒక ఉదాహరణతో వివరించారు. వజ్రవైఢూర్యాల గుర్తింపు లేని ఒక పిచ్చివాడు, గాజు ముక్కనే వజ్రం అని ఎలా భ్రమిస్తాడో, దైవజ్ఞానం లేని వ్యక్తి పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. మనిషికి దేవునితో ఒక ప్రత్యేక అనుబంధం ఏర్పడినప్పుడే అతన్ని గుర్తించ గలుగుతాడు. అల్లాహ్ ఎవరినైతే ఇష్టపడతాడో, వారికి తన గుర్తింపును మరియు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. దైవాన్ని చేరుకోవడమే ఒక నిజమైన విశ్వాసికి అసలైన సంతోషం.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించారు. ఒక తల్లికి తప్పిపోయిన తన బిడ్డ తిరిగి దొరికినప్పుడు కలిగే సంతోషం కంటే, తన దాసుడు తన వైపునకు (పశ్చాత్తాపంతో) తిరిగి వచ్చినప్పుడు అల్లాహ్‌కు అంతకంటే ఎక్కువ సంతోషం కలుగుతుంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. పండుగ దినం నిశ్చయంగా ఒక శుభప్రదమైన రోజు అయితే అంతకంటే మించిన ఒక శుభప్రదమైన రోజు మరొకటి ఉంది. అదే మనిషి తన పాపాల గురించి పశ్చాత్తాపం వ్యక్తపరిచే రోజు. ఆ రోజు జుమా మరియు పండుగ దినాల కంటే కూడా గొప్ప సంతోషకరమైన రోజు.

నిజమైన పశ్చాత్తాపంతో పాటు నిజమైన పవిత్రత మరియు పరిశుద్ధత తప్పనిసరి. అన్ని రకాల మలినాలకు, అశుద్ధాలకు దూరంగా ఉండటం దీనికి నిబంధన. అలా కాకుండా కేవలం మాట వరసకు పశ్చాత్తాపం అని పలకడం వల్ల వాస్తవానికి ఎటువంటి ప్రయోజనం ఉండదు.

ఒక శుభప్రదమైన రోజున మనిషి తన దుష్కార్యాల నుండి పశ్చాత్తాపం చెంది, అల్లాహ్ తఆలాతో ఒక సత్యమైన రాజీ ప్రతిజ్ఞ చేసుకుని, అతని ఆజ్ఞల ముందు తన తలను వంచినట్లయితే తన చెడు పనుల ఫలితంగా రహస్యంగా సిద్ధమవుతున్న శిక్ష నుండి అతను రక్షించబడతాడు. ఈ విధంగా ఆ మనిషి తను ఊహించని అద్భుతమైన స్థితిని పొందుతాడు.

నేటి ప్రపంచంలో ఎన్నో మాలిన్యాలు నిండి ఉన్నాయి. కానీ ఈ రోజుల్లో ఒక విశ్వాసి అల్లాహ్ తఆలా కోసం ఉపవాసాలు ఉండి, అతని సామీప్యాన్ని పొందేందుకు ప్రయత్నించినప్పుడు, అల్లాహ్ అతనికి అపారమైన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. మనం ఈ విషయాలను ఆచరించడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే, మనం మరియు మన కుటుంబం పండుగ అసలు ఉద్దేశ్యమైన ఆ 'నిజమైన పండుగ ఆనందాలను' పొందగలుగుతాము.

రమజాన్‌లో మనం అలవర్చుకోవడానికి ప్రయత్నించిన పుణ్యకార్యాలను ఇకముందు కూడా కొనసాగించే వారిగా అల్లాహ్ తఆలా మనల్ని అనుగ్రహించుగాక! రమజాన్ మాసంలో తరావీహ్ లేదా తహజ్జుద్ నమాజుల కోసం మసీదులకు వచ్చినట్లే, ఇప్పుడు మన ఇళ్లలో కూడా కనీసం కొన్ని నవాఫిల్ (ఐచ్ఛిక ప్రార్థనలు) నిర్వహించుకునే భాగ్యాన్ని అల్లాహ్ తఆలా ప్రసాదించుగాక! అల్లాహ్ తఆలా మనల్ని తోటి మనుషుల హక్కులను నెరవేర్చే వారిగా, ఒకరికొకరు తోడ్పడే వారిగా తీర్చిదిద్దుగాక! అల్లాహ్ తఆలా ఇటువంటి పవిత్రమైన మార్పును మనలో నిరంతరం కలిగిస్తూ ఉండుగాక!

హుజూరె అన్వర్ ప్రార్థనల (దుఆల) కోసం ఉద్బోధిస్తూ ఇట్లు ప్రవచించారు. అల్లాహ్ తఆలా అహ్మదీయులందరినీ తన కరుణాకటాక్షాల నీడలో భద్రపరచాలని ప్రార్థనలు చేస్తూ ఉండండి. అనేక ప్రాంతాల్లో చాలా మంది నిస్సహాయులైన అహ్మదీయులు అకారణంగానే చట్టం మాటున బంధీలుగా ఉన్నారు. ఉదాహరణకు పాకిస్తాన్‌లో మతపరమైన స్వేచ్ఛ లేక వారు పండుగ నమాజ్ కూడా చదువుకోలేని పరిస్థితి ఏర్పడింది. అల్లాహ్ తఆలా వారికి ఆ అదృష్టాన్ని ప్రసాదించుగాక! వారు కూడా నిజమైన పండుగను జరుపుకునేలా, తమను తాము దైవానికి దగ్గర చేసుకునేలా మరియు పండుగ బాహ్య ఆనందాలను కూడా అనుభవించేలా అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! అల్లాహ్ తఆలా వారి కష్టాలను త్వరగా తొలగించుగాక!

నేడు కూడా వారు ఎంతో భయాందోళనల మధ్య పండుగ నమాజ్‌ను నిర్వహించారు. సమయాలను మరియు ప్రదేశాలను మారుస్తూ నమాజ్ చదువుకున్నారు. కరాచీలో మరియు మరికొన్ని చోట్ల నమాజ్ చదవకుండా అడ్డుకున్నారు మరియు మసీదులపై ప్రత్యర్థులు దాడులు కూడా చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన వారి పరిస్థితి ఎలా ఉందంటే దాడులు చేసేవారిని అడ్డుకోవడానికి బదులుగా, వారే మన మసీదులకు తాళాలు వేశారు. అల్లాహ్ తఆలా త్వరలోనే

ఈ ప్రత్యర్థులను శిక్షించే మార్గాలను సిద్ధం చేయుగాక! ఆమీన్.

రోగుల కోసం కూడా ప్రార్థించండి, అల్లాహ్ రోగులందరికీ ఆరోగ్యాన్ని ప్రసాదించుగాక! మానవత్వం, ఇస్లాం మరియు జమాఅత్ కోసం ఆర్థికంగా మరియు అన్ని రకాలుగా త్యాగాలు చేసేవారిపై అల్లాహ్ తన అనుగ్రహాలను కురిపించుగాక! ఆమీన్.

అమరవీరుల పిల్లల కోసం, దైవమార్గంలో బందీలుగా ఉన్నవారి కోసం, దైవకార్యం కోసం జీవితాలను అంకితం చేసిన వారి కోసం మరియు సాధారణంగా ముస్లిం సమాజంలోని అందరి కోసం ప్రార్థించండి. అల్లాహ్ తఆలా ముస్లింలకు వివేకాన్ని, అవగాహనను ప్రసాదించు గాక! తద్వారా వారు నిజమైన అర్థంలో అల్లాహ్ తఆలాను ఆశ్రయించగలరు. ఈ కాలపు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను స్వీకరించి, వారు దైవ ప్రసన్నతను పొంది, నిజమైన పండుగ జరుపుకోగలుగుదురు గాక! ఆమీన్

రెండవ ఖుత్బా ముగింపు తర్వాత హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అహ్మదియ్యా జమాఅత్ సభ్యులందరికీ పండుగ శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం హుజూరె అన్వర్ ఇలా సూచించారు.

పాకిస్తాన్ ప్రజలను నిరంతరం మీ ప్రార్థనలలో గుర్తుంచుకోవాలని నేను ఇది వరకే చెప్పాను. అక్కడ పరిస్థితులు చాలా కఠినంగా ఉన్నాయి. అల్లాహ్ తఆలా నిజమైన అర్థంలో వారికి పండుగను శుభదాయకం చేయుగాక! వారందరికీ పండుగ శుభాకాంక్షలు. పాపం వారు తమ ఇళ్లకే పరిమితమై ఉన్నారు. పైకి నిరాశ కనిపిస్తున్నప్పటికీ, వారు ఆందోళన చెంద కూడదు. అల్లాహ్ తఆలా త్వరలోనే పరిస్థితులను మారుస్తాడు. ఇన్షా అల్లాహ్

---

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -